www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | గురువారం, అక్టోబర్8,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:213 | పేజీలు: 8 | వెల: రూ.5/-

అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్..

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి ఉద్యోగాల తొలగింపు ప్రక్రియను చేపట్టింది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. భారత్, అమెరికా, యూకే సహా పలు దేశాల్లోని రిటైల్ బృందాలపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది. రానున్న రోజుల్లో మొత్తం 30,000 మంది ఉద్యోగులను తొలగించాలనే విస్తృత ప్రణాళికలో భాగంగానే ఈ తాజా కోతలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే 'స్టోర్స్' వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులను తొలగించినట్లు రాయిటర్స్, బిజినెస్ ఇన్‌సైడర్ నివేదికలు పేర్కొన్నాయి. "మా ప్రాధాన్యతలను మెరుగ్గా చేరుకోవడానికి వీలుగా స్టోర్స్ బిజినెస్‌లో కొన్ని సర్దుబాట్లు చేశాం" అని అమెజాన్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు వివరించారు. అయితే, ఎంతమందిని తొలగించారనే కచ్చితమైన సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. ఆ సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ఎక్కువగా ఆర్డర్లు చేశారు.

ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు


■ ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

సీఈసీ, కేంద్ర విధానాలపై
మా పోరాటం ఆగదు

రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపు లోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రే వంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రద్దు చేయాలని ఇండియా కూటమి నిరసనకు పిలుపునిచ్చింది. ఈ



నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత రాహుల్ గాంధీని విడుదల చేశారు. అయితే, ఆయనను కలిసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు.

ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్
అభినందన తీర్మానం

25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం



■ భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస

■ దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు

■ దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

అమరావతి,అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది.తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

■ తిరుమల గిరులపై భక్తజన సందోహం

■ టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 12 గంటల సమయం

■ భక్తులతో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు

అమరావతి,అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం నాటికి, శ్రీవారి దర్శనం కోసం 31 వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.మంగళవారం (అక్టోబర్ 6) ఒక్కరోజే 73,629 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ఎస్సీ రోస్టర్‌లో మార్పులు చేస్తే
ఉద్యమిస్తాం

■ ఎస్సీ రోస్టర్‌లో మార్పులను వ్యతిరేకిస్తామన్న మంద కృష్ణ

■ మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలని డిమాండ్

■ సీఎం రేవంత్ హామీ అమలు చేయాలని కోరిన మంద కృష్ణ



హైదరాబాద్,((సామాన్యుడి అస్త్రం))

ఎస్సీ రోస్టర్ పాయింట్లలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణలో జనాభా ప్రాతిపదికన మా దిగలకు తగిన వాటా దక్కలేదని అన్నారు.ఉస్మానియా యూ నివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట మంగళవారం రాత్రి జరిగిన ఎంఎస్ ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సులో ఆయన మా ట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను పెంచి, వర్గీకరణకు అను గుణంగా మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలని డి మాండ్ చేశారు.

దసరాకు 7,000
ప్రత్యేక బస్సులు

■ రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసుల ఏర్పాటు

■ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన టికెట్ ధరలు అమలు

■ అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది.



డ్రగ్స్‌పై యుద్ధం..
సమష్టిగా కదులుదాం

■ ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ

■ 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం

- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్

అమరావతి,అక్టోబర్7((సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు



ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

యాదాద్రి ప్లాంట్‌పై
హరీశ్‌కు భట్టి సవాల్



బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు.

సీఈసీ, కేంద్ర విధానాలపై మా పోరాటం ఆగదు: సీఎం రేవంత్‌రెడ్డి

రాహుల్ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని విమర్శించారు. ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను అణచివేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదన్నారు. వారిపై పోలీసులు వ్యవహరించిన తీరుతో కేంద్ర ప్రభుత్వ అసహనం బయటపడిందని ఆరోపించారు.అక్రమ అ రెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భ యపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కా పాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో త మ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆ యన పునరుద్ఘాటించారు.

రాహుల్ నాయకత్వంలో మా పోరాటం కొనసాగిస్తాం..

రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఈసీ, కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఈసీ, కేంద్ర విధానాలపై తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలో అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు ఈడీ, సీబీఐని వాడుకున్నారని, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. అనేక మంది ఓట్లను సీఈసీ అకారణంగా తొలగించిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు.

సీఈసీ రాజీనామా వరకు పోరు

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ సంస్థ అని అన్నారు. గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగించుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. ప్రజల ఓట్లను తొలగించి ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని చెప్పారు. అవసరమైతే ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల నుంచి పార్లమెంట్ వరకు ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

'జీకే గో బ్యాక్' కొనసాగుతుంది

గతంలో స్వాతంత్ర్య పోరాటంలో 'సైమన్ గో బ్యాక్' నినాదం కీలక పాత్ర పోషించిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు 'ఎస్ఐఆర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో రైతుల ఉద్యమం సందర్భంగా ప్రజల ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని పేర్కొంటూ.. ఇప్పుడు కూడా ప్రజల ఒత్తిడికి తలొగ్గాల్సిందేనన్నారు.

ఇది ప్రజల ఉద్యమం

ఓటు హక్కు పరిరక్షణ కోసం జరుగుతున్నది కాంగ్రెస్ పార్టీ ఉద్యమం మాత్రమే కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల హక్కులను కాలరాసిన వారు చివరకు ప్రజల కోర్టులోనే సమాధానం చెప్పాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలు ఒక్కటై



గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా వినాల్సిందేనని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

నేడు చలో లోక్‌భవన్

ఓటు హక్కు పరిరక్షణ కోసం నేడు(గురువారం) నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు 'చలో లోక్ భవన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రాహుల్‌గాంధీని వరుసగా రెండోసారి అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆయన విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేకే కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గాన్ని ఎంచుకుందని ఆరోపించారు. ప్రతిపక్ష, ఇండియా కూటమి నేతలపై కక్షసాధింపు చర్యలు సరికాదని పేర్కొంటూ.. ఓటు హక్కు పరిరక్షణ కోసం నిర్వహించే 'చలో లోక్ భవన్'లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

మొదటి పేజీ తరువాయి

గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి

జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం

ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేసిన తప్పిదాలను చెప్పకుండా ప్రతిపక్షంలో ఉన్నామని ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. అవసరమైన బొగ్గు ఎక్కడి నుంచి వస్తుంది? ఎంత వస్తుంది? నాణ్యత ఏమిటి? అనే అంశాలపై స్పష్టత లేకుండానే యాదాద్రి ప్లాంట్ నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. వీటి ఆధారాలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. బుధవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మా ట్లాడారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు.దాదాపు 20 వేల మెగావాట్ల డిమాండ్ పెరిగినప్పటికీ కోతలు లేకుండా



కరెంట్ ఇస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ కంటే పెద్ద రాష్ట్రమైన కర్ణాటకలో పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని వివరించారు. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగినా నిరంతరాయంగా విద్యుత్ సరాఫరాకు కృషి చేస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులు, సిబ్బందిని ప్రశంసించాల్సింది పోయి కొందరు నాయకులు త ప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించబోతున్నామనే వాదనలను ఖండించారు. 'పవర్ సెక్టార్‌ను అమ్మేయాలన్న ఆలోచన, చర్చ అసలు లేదు. మేము ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని బలంగా విశ్వసిస్తున్నాం. ఎవరికివారు ఊహించుకుని, ఆ ఊహల ఆధారంగా విమర్శలు చేయడం సరికాదు' అని పేర్కొన్నారు.

డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదాం

మొదటి పేజీ తరువాయి

అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు

గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారుహోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

మొదటి పేజీ తరువాయి

మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది.అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది.ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత,



రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు..



మొదటి పేజీ తరువాయి

. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మొదటి పేజీ తరువాయి

భక్తులతో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు

మంగళవారం నాడు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లు

భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లుగా నమోదైంది.అదేవిధంగా, టీటీడీ నిన్న 3.91 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో 1.75 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,334 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.



ఎస్సీ రోస్టర్‌లో మార్పులు చేస్తే ఉద్యమిస్తాం



మొదటి పేజీ తరువాయి

విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్

మార్చిలో 'ఛలో హైదరాబాద్' నిర్వహణకు నిర్ణయం

సీఎం హామీ అమలు చేయాలి

జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని మంద కృష్ణ కోరారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రోస్టర్ సవరణ పేరుతో మరో వివాదానికి తెరతీయడం సరికాదన్నారు.

ఐక్యంగా ఉద్యమిద్దాం

కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం కోసం మాలలు సహా అన్ని సామాజిక వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యారంగ సమస్యలపై వచ్చే మార్చిలో 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలను కలుపుకుని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల నిర్మూలన కోసం ఉద్యమాలను కొనసాగిస్తామని మంద కృష్ణ తెలిపారు.

కోర్టులో సర్కారీ భూమి..

క్షేత్రంలో ఎందుకీ మౌనం?

- 69/1పై రెవెన్యూ మాటొకటి.. చర్యలొకటా?
- వివాదాస్పద స్థలాలకు మున్సిపల్ అనుమతులు ఎలా వచ్చాయన్నది మరో ప్రశ్న
- 22ఏ ప్రభుత్వ భూమని హైకోర్టులోనే చెప్పిన రెవెన్యూ శాఖ
- జూలై 20న మరో కోర్టు ఉత్తర్వు.. రెండు నెలలు దాటినా తేలని హద్దులు



సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :

కోర్టులో మాత్రం ఇది ప్రభుత్వ భూమి అంటారు.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి హద్దులు తేలాలి.. పై అధికారులకు రాశాం అంటున్నారు. మరి మియాపూర్ సర్వే నంబర్ 69/1 విషయంలో అసలు రెవెన్యూ శాఖ వైఖరి ఏంటి? ఇప్పుడు ఇదే ప్రశ్న స్థానికంగా చర్చకు దారితీస్తోంది.W. P. No. 38364/2025లో ప్లాట్ నెం.32 విషయంలో ప్రభుత్వ తరఫున రెవెన్యూ శాఖ స్పష్టమైన వాదన చేసింది. మియాపూర్ సర్వే నెంబర్. 69/1లో 19 ఎకరాల 14 గుంటలు సర్కారిభూమి 22ఏ ప్రోహిబిటెడ్ లిస్ట్లో ఉందని, సర్వే నెంబర్.224గా చెబుతున్న నిర్మాణం చేస్తున్నారని కానీ వాస్తవానికి 69/1లోనే ఉందని కోర్టుకు తెలిపింది. అదే నిర్మాణానికి పెర్మిట్ నెం .0666/GHMC/IA/C21/2025 ఆధారంగా పిటిషనర్ కోర్టును ఆశ్రయించారు.తర్వాత పక్కనే ఉన్న ప్లాట్ నెం.30 పార్ట్ మరియు 31 పార్ట్ కు పెర్మిట్ నెం.4331/GHMC/SLP/2025-దీని ఆధారంగా ఫ్రో.చీశీ.23116/2026 దాఖలైంది. దీని ఆధారంగా జూలై 20న హైకోర్టు డ్యూ ప్రాసెస్ లేకుండా నిర్మాణంలో జోక్యం చేసుకోవద్దని చెప్పింది. అయితే ఈ ఉత్తర్వు లో నిర్మాణం జరుగుతున్నా స్థలం సర్వే నెంబర్ 224లోనే ఉందని గానీ లేదా 69/1 కాదని గానీ తేల్చలేదు. ఇక్కడే అధికారులకు అసలు పరీక్ష మొదలైంది. కోర్టు చర్యలు తీసుకోవద్దని చెప్పలేదు, చట్టబద్ధమైన ప్రక్రియ పాటించమని మాత్రమే చెప్పింది. కోర్ట్ ఉత్తర్వుల జులై లో ఇచ్చిన రెవెన్యూ మాత్రమే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తుంది. ఇంకోవైపు, భూమిపై పాత వివాదాలు, సర్వే ఓవర్లప్ ఆరోపణలు ఉండగానే మున్సిపల్ శాఖ బిల్డింగ్ పెర్మిషన్స్ ఎలా జారీ చేసిందన్న ప్రశ్న కూడా ఉత్పన్నామౌతుంది. స్థలాన్ని పరిశీలించిన అధికారులు రెవిన్యూ స్టేటస్ , 22ఏ అంశం, పెండింగ్ డిస్పట్స్ తనిఖీ చేశారా? లేక పర్మిషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారా? అనే ప్రశ్న అందరి మదిలో మేదులుతుంది.కోర్టులో ప్రభుత్వ భూమని వాదించిన రెవెన్యూ శాఖ అదే భూమిపై నిర్మాణాలు ముందుకు సాగుతుంటే ఎందుకు వేగంగా స్పందించడం లేదు? మున్సిపల్ అనుమతులు ఎవరి పరిశీలనతో వచ్చాయి? ఈ రెండు శాఖలు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

మునిసిపల్ శాఖ మౌనం..

గుంతలపై ట్రాఫిక్ పోలీసుల యాక్షన్!

మియాపూర్--బాచుపల్లి మార్గంలో రెడీమిక్స్ కాంక్రీట్‌తో మరమ్మతు



- హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు సమీపంలో దెబ్బతిన్న రహదారికి తాత్కాలిక మరమ్మతులు
- రెడీమిక్స్ కాంక్రీట్‌తో ప్రమాదకర ప్రాంతాన్ని సరిచేసిన మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు
- వాహనదారుల ఇబ్బందులు గుర్తించి స్పందించిన ట్రాఫిక్ సిబ్బంది

సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :

మియాపూర్ నుంచి బాచుపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో వాహనదారులకు ఇబ్బందిగా మారిన దెబ్బతిన్న రోడ్డును మియాపూర్ ట్రాఫిక్ సీఐ నరసింహ సంజయ్ రెడ్డి చొరవ తీసుకుని గుంతల మరమ్మత్తులు చేపట్టారు. మియాపూర్ హెచ్ డి ఎఫ్ సి సమీపంలో రహదారి దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతున్న ప్రాంతంలో రెడీమిక్స్ కాంక్రీట్‌తో మరమ్మతులు చేపట్టారు.నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో రోడ్డు దెబ్బతినడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఇతర వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా రద్దీ సమయాల్లో దెబ్బతిన్న ప్రాంతాన్ని తప్పించేందుకు వాహనాలు ఒక్కసారిగా దిశ మార్చాల్సి రావడం వల్ల ట్రాఫిక్ మందగించడంతో పాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఏర్పడుతోంది.ఈ పరిస్థితిని గమనించిన మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకుండా సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. దెబ్బతిన్న భాగంలో రెడీమిక్స్ కాంక్రీట్ వేసి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.

సమస్య కనిపించింది.. స్పందించారు

సాధారణంగా రహదారుల మరమ్మతులు సంబంధిత పౌర సంస్థలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే రోడ్డు దెబ్బతినడం వల్ల రోజువారీ ట్రాఫిక్‌పై ప్రభావం పడుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపడం వాహనదారుల దృష్టిని ఆకర్షించింది.చిన్న గుంత అయినా, దెబ్బతిన్న రోడ్డు భాగమైనా భారీ ట్రాఫిక్ ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి చోట సమస్యను గుర్తించి వెంటనే మరమ్మతు చేయించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ అంతరాయాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు.

శాశ్వత పరిష్కారం అవసరం

ట్రాఫిక్ పోలీసుల చొరవతో ప్రస్తుతం సమస్యాత్మక ప్రాంతానికి ఉపశమనం లభించినప్పటికీ, మియాపూర్--బాచుపల్లి ప్రధాన రహదారిపై దెబ్బతిన్న ప్రాంతాలను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వర్షాలు, భారీ వాహనాల రాకపోకలు, రహదారి ఉపరితలం దెబ్బతినడం వంటి కారణాలను గుర్తించి శాశ్వత మరమ్మతులు చేపడితేనే వాహనదారులకు దీర్ఘకాలికంగా ఇబ్బందులు తప్పుతాయి.ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులే రోడ్డుపై ఉన్న సమస్యను గుర్తించి కాంక్రీట్‌తో సరిచేయాల్సిన పరిస్థితి రావడం మాత్రం సంబంధిత రహదారి నిర్వహణ విభాగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది.



ఒక కేసులో బెయిల్, మరో కేసులో హైకోర్టు ఆదేశాలు.. క్రిశాంక్ ఇష్యూలో ఏం జరిగింది?



సీఎం రేవంత్ కుమార్తెపై ఆరోపణల వ్యవహారంలో క్రిశాంక్‌పై సైబర్ క్రైమ్ కేసు

అరెస్ట్ చేయకుండా చూడాలని హైకోర్టును ఆశ్రయించిన మన్నె క్రిశాంక్

దర్యాప్తు చేసుకోవచ్చు కానీ, ముందుగా నోటీసులు ఇవ్వాలని పోలీసులకు ఆదేశం

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన ధర్మాసనం

హైదరాబాద్, అక్టోబర్ 7(సామాన్యుడి అస్త్రం)

మరో కేసులో అరెస్టయిన క్రిశాంక్‌కు సికింద్రాబాద్ కోర్టులో బెయిల్ మంజూరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమార్తె నైమిశా రెడ్డిపై సోషల్ మీడియాలో ఆరోపణలు చేసిన కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు తెలంగాణ హైకోర్టులో పాక్షిక ఊరట లభించింది. ఈ కేసులో తొందరపడి అరెస్ట్ చేయవద్దని, చట్ట ప్రకారం ముందుకెళ్లాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తులో భాగంగా క్రిశాంక్‌కు ముందుగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్-ఎస్) 2023లోని సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది.

విచారణలో ఏం జరిగిందంటే?

సీఎం కుమార్తె ఆస్తులు, ఫార్మా కంపెనీల గురించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ చేసిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అక్టోబర్ 5న క్రిశాంక్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 353(2) (పుకార్లు వ్యాప్తి చేసి శత్రుత్వం పెంచడం), 352 (శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం) కింద కేసు పెట్టారు.దీంతో పోలీసులు తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ క్రిశాంక్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. మాధవీ దేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు గుడ్డిగా కేసు నమోదు చేశారని, సివిల్ దుస్తుల్లో తనను అనుసరిస్తున్నారని క్రిశాంక్ తరఫు న్యాయవాది వాదించారు. అయితే, ఎఫ్ఐఆర్ ప్రాథమిక దశలోనే ఉందని, ఎలాంటి ఉపశమనం ఇవ్వకూడదని ప్రభుత్వ న్యాయవాది కోరారు.ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. పోలీసులు దర్యాప్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, సుప్రీంకోర్టు "అర్నేష్ కుమార్ ఎం స్టేట్ ఆఫ్ బీహార్" కేసులో ఇచ్చిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. దర్యాప్తునకు క్రిశాంక్ పూర్తిగా సహకరించాలని సూచిస్తూ, ప్రస్తుత దశలో అరెస్ట్‌పై ఎలాంటి నిషేధం విధించలేదు.

మరో కేసులో అరెస్ట్.. బెయిల్

ఇదిలా ఉండగా, సీఎం కుటుంబంపై ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశారన్న మరో కేసులో గోపాలపురం పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేశారు. అయితే, సికింద్రాబాద్ కోర్టు ఆయనకు షరతులు లేని బెయిల్ మంజూరు చేసింది.

రాష్ట్రంలో కరెంటు సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నిర్లక్ష్యమే

హైదరాబాద్, అక్టోబర్ 7(సామాన్యుడి అస్త్రం)

ట్రూ అప్ చార్జీల భారం తప్పించాలని కోరితే, ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వం సక్రమంగా కరెంట్ సరఫరా చేస్తే రైతులు ఎందుకు సబ్ స్టేషన్ల ముందు, రోడ్లపై ధర్నాలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కరెంటు సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నిర్లక్ష్యమే కారణమని ఆయన ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం మీడియా సమావేశం సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు ఒక ప్రకటనలో స్పందించారు.



నా వీడియోలను మార్ఫింగ్ చేశారు: బీఆర్ఎస్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ ఫైర్



తనపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని చామల ఆరోపణ

బీఆర్ఎస్ అక్రమాస్తులు బయటపెడుతున్నందుకే ఈ దాడి అని వ్యాఖ్య

వీడియోలు మార్ఫింగ్ చేసిన వారిపై కేసులు పెడతానని హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. తాజాగా, తనపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులపై తాను వ్యతిరేకంగా మాట్లాడినట్లు తన వాయిస్‌ను, వీడియోలను ట్యాంపరింగ్ చేసి సర్క్యులేట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన చామల... బీఆర్ఎస్ నేతల పదేళ్ల అక్రమాస్తులను తాను బయటపెడుతున్నందుకే ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. "బీఆర్ఎస్ నేతల అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్షగట్టి మార్ఫింగ్ వీడియోలతో దాడి చేస్తున్నారు. ఈ కుట్రల వెనుక ఉన్న వారిపై కచ్చితంగా కేసులు పెడతాను" అని ఆయన హెచ్చరించారు.ఈ ఘటనపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ కూడా స్పందించారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డిపై మార్ఫింగ్ వీడియోలు సృష్టించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. తెలంగాణ రాజకీయాల్లో మార్ఫింగ్ వీడియోల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్‌లో కెనడియన్ భర్తకు భార్య పుంసత్వ పరీక్ష.. రూ. 2 కోట్ల డిమాండ్

ఎన్నారై భర్తను వేధిస్తున్న భార్య కుటుంబం

బలవంతంగా నపుంసకత్వ పరీక్ష చేయించారని ఆరోపణ

పాస్‌పోర్టు, ఇతర పత్రాలు లాక్కున్నారని బాధితుడి ఆవేదన

బాధితుడి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనను బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్లి పుంసత్వ పరీక్షలు చేయించి, రూ. 2 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కెనడా పౌరుడైన ఓ ఎన్నారై పోలీసులకు ఫిర్యాదు చేశారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దొమ్మరపోచంపల్లికి చెందిన బాధితుడికి ఇటీవలే వివాహమైంది. ఆయన ఫిర్యాదు ప్రకారం, గత నెల 7వ తేదీన తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనకు తెలియకుండా పాస్‌పోర్టు, కెనడియన్ పౌరసత్వ పత్రం, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లారు. ఆ తర్వాత రెండు రోజులకు, అంటే 9వ తేదీన, తనను బెదిరించి సోమాజిగూడలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి బలవంతంగా పుంసత్వ పరీక్షలు చేయించారు.ఆ పరీక్షల తర్వాత, అతడికి నపుంసకత్వం ఉందని అసత్య ప్రచారం చేస్తూ, ఈ విషయం బయటపెట్టకుండా ఉండాలంటే రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వేధింపులు భరించలేక, బాధితుడు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. తనను బెదిరింపులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.బాధితుడి ఆరోపణల మేరకు, న్యాయస్థానం అనుమతితో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. అయితే, ఈ కేసు కేవలం బాధితుడి ఫిర్యాదు ఆధారంగానే నమోదైంది. నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న భార్య, ఆమె కుటుంబ సభ్యుల వాదన ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఈ ఘటనపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



మహిళలకు రూ.2,500, బంగారం.. ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం

మహిళలకు రూ.2500 నెలవారీ సాయం అంటూ జరుగుతున్న ప్రచారం

ఇది పూర్తిగా అసత్యమని కొట్టిపారేసిన తెలంగాణ ప్రభుత్వం

సీఎం రేవంత్ రెడ్డి పేరుతో ఏఐ టూల్స్‌తో డీప్‌ఫేక్ వీడియో సృష్టి

సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని ప్రజలకు ప్రభుత్వ సూచన

హైదరాబాద్, అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)



తెలంగాణలో మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయంతో పాటు, కల్యాణలక్ష్మి పథకం కింద రెండు తులాల బంగారం ఇస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇదంతా పూర్తిగా అసత్య ప్రచారమని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని బుధవారం స్పష్టం చేసింది.బతుకమ్మ పండుగ నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఇది ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్ ఉపయోగించి సృష్టించిన నకిలీ వీడియో అని ప్రభుత్వ ఫ్యాక్ట్-చెక్ విభాగం వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి చిత్రానికి డీప్‌ఫేక్ ఆడియోను జోడించి ఈ వీడియోను రూపొందించారని, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది.ఈ నేపథ్యంలో, ప్రజలు ఇలాంటి నిరాధారమైన, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, సోషల్ మీడియాలో ధ్రువీకరణ లేకుండా వచ్చే వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.రాష్ట్రంలో మహిళల కోసం కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. అయితే, వైరల్ వీడియోలో పేర్కొన్నట్లుగా ప్రతినెలా రూ. 2,500 సాయం, రెండు తులాల బంగారం వంటి హామీలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని స్పష్టమవుతోంది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న ఇలాంటి నకిలీ వార్తల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వర్గాలు పునరుద్ఘాటించాయి

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక.. రెండు డీఏలు విడుదల



ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం

మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం

అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు

ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం

హైదరాబాద్, అక్టోబర్7(రియల్ అడ్వైజర్)

దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే వారికి ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.


హైదరాబాద్ లో 30 మంది ముస్లిం ఓటర్ల తొలగింపు యత్నం.. బీజేపీ ఏజెంట్‌పై కేసు

ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఘటన

ఒకేసారి 30 ఓట్ల తొలగింపునకు కుట్ర చేసినట్లు ఆరోపణ

30 మంది ఓట్లను తొలగించాలంటూ సెప్టెంబర్ 28న ఫారం-7 దరఖాస్తుల సమర్పణ

హైదరాబాద్, అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)



హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా నుంచి 30 మంది ముస్లింల పేర్లను అక్రమంగా తొలగించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయంగా కలకలం రేపుతోంది.వివరాల్లోకి వెళితే, ముషీరాబాద్ నియోజకవర్గంలోని సూర్య నగర్ పోలింగ్ స్టేషన్ నెం. 210 పరిధిలో ఎస్. బాలచందర్ అనే బీజేపీ బూత్ ఏజెంట్, 30 మంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ సెప్టెంబర్ 28న ఫారం-7 దరఖాస్తులను సమర్పించారు. బాధితులంతా ముస్లిం వర్గానికి చెందినవారే. అధికారులు వాటిని మూకుమ్మడిగా స్వీకరించేందుకు నిరాకరించడంతో, అతను ఆ పత్రాలను అక్కడే వదిలివెళ్లినట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) టి. ప్రవీణ్ కుమార్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు జరిపిన విచారణలో ఆ 30 మంది ఓటర్లు వారి చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో, దురుద్దేశంతోనే బాలచందర్ ఈ చర్యకు పాల్పడ్డారని ఈఆర్ఓ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బాలచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనపై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు తీవ్రంగా స్పందించాయి. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని, దీనిపై సిట్ విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

ఎర్రవల్లిలో 45 ఎకరాల మిస్సింగ్ భూమి ఎక్కడ?

సర్వేకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం!



హైదరాబాద్, అక్టోబర్7((సామాన్యుడి అస్త్రం)

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న భూమి రికార్డులను సమర్పించాలని కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.22 ఏపై శాసనసభలో గత నెల 16వ తేదీన నిర్వహించిన చర్చలో ఆ భూములపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ విచారణ పురోగతిపై మంగళవారం రాత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ పురోగతిపై సీఎం కమిటీ సభ్యులను ప్రశ్నించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని సీఎంకు అధికారులు వివరించారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని అధికారులు తెలియజేశారు.ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని నిర్మించాలని సీఎం ఆదేశించారు.అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.మరోవైపు కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినిగియోంచే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ ప్రాంతం ఆయనకు రాజకీయంగా, వ్యక్తిగతంగా అత్యంత కీలకం అన్న సంగతి తెలిసిందే. గతంలో కేసీఆర్ ఎక్కువ సమయం ఇక్కడే గడుపుతుండటంతో దీనిని రాజకీయంగానూ ఓ ముఖ్య కేంద్రంగా భావిస్తారు. దాదాపు మూడు వారాల క్రితం శాసనసభలో ఈ భూముల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించగా.. ఇప్పుడు అధికారికంగా విచారణ, నోటీసుల జారీ దశకు చేరుకుంది. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ స్పందన ఎలా ఉండబోతుందనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

హైదరాబాద్ లో దుర్గామాత మండపాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.. పోలీసులు కీలక ప్రకటన



హైదరాబాద్, అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

హిందూ సంప్రదాయాల్లో అత్యంత పవిత్రమైన పండగల్లో దసరా ఒకటి. ఏటా ఈ నవరాత్రి ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తుంటారు. దుర్గామాత తొమ్మిది రూపాలను ఆరాధిస్తూ, తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, పూజలు నిర్వహిస్తారు. అయితే 2026 సంవత్సరంలో దేవీ నవరాత్రులు అక్టోబర్ 11వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 11న బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.అలాగే అక్టోబర్ 12న గాయత్రీ దేవి, అక్టోబర్ 13న అన్నపూర్ణాదేవిగా భక్తులను ఆశీర్వదించనున్నారు. ఇక అక్టోబర్ 14న లలితా త్రిపుర సుందరీ దేవి, అక్టోబర్ 15న చండీ దేవి, అక్టోబర్ 16న మహా లక్ష్మీదేవి ఆరాధన ఉంటుంది. అలాగే అక్టోబర్ 17న సరస్వతీదేవి, అక్టోబర్ 18న దుర్గాదేవి, అక్టోబర్ 19న మహిషాసుర మర్దిని రూపంలో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తుంది. ఇక చివరి రోజు మహానవమి కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, హోమాలు చేస్తారు. నవరాత్రుల అనంతరం అక్టోబర్ 20న దసరా పండుగను జరుపుకుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఈ నవరాత్రి ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.అయితే హైదరాబాద్ మహా నగరంలో ఏటా పలు ప్రాంతాల్లో దుర్గా మాతా మండపాలను ఏర్పాటు చేసి 9 రోజులపాటు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో నగరంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపన.. శోభాయాత్ర అలాగే నిమజ్జన కార్యక్రమాల కోసం పోలీసు శాఖ ఆన్ లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. తమ కాలనీలు, ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను, మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు పోలీసు శాఖ అధికారిక పోర్టల్ అయిన ప్ట్రెజూం://జూశీశ్రీ.అఎవజూశీత్యిశ్రీ.ంజూశీ-శ్రీఅఎవ.స్ట్రశీజ.అఅ ద్వారా ముందుగానే తమ వివరాలను సమర్పించి, రిజిస్టర్ రశీదు పొందాలని సూచించారు. ఇటీవల పూర్తి అయిన గణేష్ నవరాత్రి ఉత్సవాలకు కూడా పోలీసులు ఇలాంటి సదుపాయాన్నే కల్పించారు. ఈ మేరకు నగర వ్యాప్తంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా.. సురక్షితంగా జరిగేలా చూసేందుకు మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు సమాచారం ఇవ్వాలని మల్కాజిగిరి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావుకు గౌరవ డాక్టరేట్


ఘనంగా అంబేడ్కర్ వర్సిటీ 27వ స్నాతకోత్సవం

హైదరాబాద్, అక్టోబరు 7((సామాన్యుడి అస్త్రం)



తెలంగాణ సినిమాకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన దర్శకుడు, నటుడు, కవి బి.నర్సింగ్‌రావుకు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించారు. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ వర్సిటీ) 27వ స్నాతకోత్సవం బుధవారంజూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. తెలంగాణ గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా ముఖ్య అతిథిగా హాజరై.. విద్యార్థులకు డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలు, బుక్‌ప్రైజ్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ అందుకున్న 'మా భూమి' దర్శకుడు బి.నర్సింగ్‌రావును గవర్నర్ అభినందించారు.నర్సింగ్‌రావు ఒక విశిష్ట చలనచిత్ర దర్శకుడని కొనియాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సామాజిక వాస్తవాలను జాతీయ, అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేశారని ప్రశంసించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు, డిజిటల్ విద్యపై ఉన్నత విద్యాసంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా గవర్నర్ పిలుపునిచ్చారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ యుగంలో.. కొత్త సాంకేతికత మానవ వినాశనానికి కాకుండా సరికొత్త సమాజ నిర్మాణానికి ఉపయోగపడేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు.స్నాతకోత్సవంలో భాగంగా 23 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ, ఒకరికి ఎంఫిల్ డిగ్రీ ప్రదానం చేశారు. యూజీ, పీజీలో 38 బంగారు పతకాలను విద్యార్థులకు అందజేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలుకు చెందిన ఓ ఖైదీ అన్ని సబ్జెక్టులలో అత్యధిక మార్కులు సాధించి బంగారు పతకం, బుక్ ప్రైజ్ అందుకున్నారు. పెద్దపల్లికి చెందిన వట్టిపల్లి పావని (స్కూల్ అసిస్టెంట్), ఆమె కుమార్తె హైందవిరావు ఒకే వేదికపై పీజీ సర్టిఫికెట్లు అందుకోవడం ప్రత్యేకఆకర్షణగా నిలిచింది. నెల్లూరు జిల్లాకు చెందిన బొజ్జనపల్లి శ్రీఆశ్రిత 3 బంగారు పతకాలతో చరిత్ర సృష్టించింది.

ముగిసిన ఫారం 6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ



ఇకపై వచ్చే ఫారం- 6 దరఖాస్తుల పరిశీలన సర్ తర్వాతే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ ఆగదు: సీఈవో సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 7(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటరు వివరాల్లో సవరణలకు సంబంధించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. తాజా లెక్కల ప్రకారం మొత్తం 7,56,180 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందులో కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6 దరఖాస్తులు 4,40,942 ఉన్నాయి. ప్రవాస భారతీయ ఓటర్లకు సంబంధించిన ఫారం-6ఏ దరఖాస్తులు 6,240, ఓటర్ల పేర్ల తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు 27,555, ఓటర్ల వివరాల మార్పు, సవరణలు, చిరునామా మార్పు తదితరాలకు సంబంధించిన ఫారం-8 దరఖాస్తులు 2,81,443 ఉన్నాయి.బుధవారం వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాలో అర్హులను చేరుస్తామని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్ కోసం నిర్దేశించిన గడువు ముగిసినా కొత్త ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియ మాత్రం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇకపై కూడా ఫారం-6, 7, 8లను స్వీకరిస్తామని తెలిపారు అయితే, సర్ తుది జాబితాలో కాకుండా ఎన్నికల సంఘం తదుపరి రూపొందించే జాబితాలో అర్హులుగా గుర్తిస్తే. కొత్త ఓటర్ల పేర్లను జాబితాలో చేరుస్తామని వెల్లడించారు. అలాగే, సర్ తుది జాబితా వెలువడిన తర్వాత కూడా 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత, ఇప్పటి వరకు ఓటరు నమోదు చేసుకోని వారు కూడా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సీఈఓ వెల్లడించారు.

ఆర్టీసీ విలీనం కాంగ్రెస్‌తోనే సాధ్యం: మహేశ్‌గౌడ్



అఫ్జల్‌గంజ్, అక్టోబరు 7 (సామాన్యుడి అస్త్రం)

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్, సీబీఎస్‌లో టిడబ్ల్యూయు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 97 డిపోల్లో జరుగుతున్న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో టిడబ్ల్యూయుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు.ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ మద్దతిస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయు) బాణం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కార్మికులను కోరారు. టిడబ్ల్యూయు అధ్యక్షుడు మొగిళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ యూనియన్ నూతన ప్రధాన కార్యదర్శిగా ఈ.అశ్వత్థామరెడ్డిని ప్రకటించారు. ఈ సభలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరామ్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైబ్యునల్ తేల్చితేనే పాలమూరు-రంగారెడ్డి!

'పోలవరం' వాటా 45 టీఎంసీలపై రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం తప్పదని వెల్లడి
మైనర్ ఇరిగేషన్‌లో 45టీఎంసీల పాడుపు ప్రతిపాదనపై అసంతృప్తి
ఎత్తిపోతలపై అడుగంటుతున్న ఆశలు

హైదరాబాద్, అక్టోబరు 7 (సామాన్యుడి అస్త్రం)

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఆశలు అడుగంటే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను పరిశీలించడానికి కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) విముఖత చూపుతోంది.

సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు



రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చారంటూ క్రీడాకారులను అభినందించిన సీఎం

మొత్తం 8 పతకాలు సాధించినట్లు వెల్లడించిన శాప్ ఎండీ

క్రీడాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని చంద్రబాబు హామీ

అమరావతి,అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. నేడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటిచెప్పినందుకు వారిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రికెటర్ శ్రీచరణి, ఆర్చర్లు గణేశ్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలను శాప్ (ఎస్ఎస్ఆర్) ఎండీ భరణి ముఖ్యమంత్రికి వివరించారు. మూడు వేర్వేరు క్రీడాంశాల్లో మన అథ్లెట్లు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 8 పతకాలను గెలుచుకున్నారని ఆయన తెలిపారు.ఈ విజయాల స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలతో పాటు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం: రామ్మోహన్ నాయుడు

కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు

భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా

విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి

అమరావతి,అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం, కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.



టీడీపీ యాత్రపై ప్రధాని ప్రశంసలు..

కృతజ్ఞతలు తెలిపిన నారా లోకేశ్

ప్రధానికి ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన నారా లోకేశ్

తిరుపతి నుంచి కాశీకి కృష్ణా, గోదావరి జలాలతో బైక్ యాత్ర

ప్రభుత్వాధినేతగా మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ 'సేవా సంకల్ప యాత్ర'

మీ మాటలు కార్యకర్తలకు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్న లోకేశ్



తెలుగుదేశం పార్టీ నిర్వహించిన 'సేవా సంకల్ప యాత్ర'ను ప్రశంసించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ప్రధాని అందించిన ప్రోత్సాహకర వ్యాఖ్యలు తమ పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా లోకేశ్ తన పోస్టులో.. "ధన్యవాదాలు నరేంద్ర మోదీ గారూ. గత 25 ఏళ్లుగా మీరు అందిస్తున్న నిరంతర సేవలు, సుపరిపాలనకు నివాళిగా ఈ యాత్రను ఒక చిన్న కానుకగా భావిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను కాశీ క్షేత్రానికి తీసుకెళ్లడం మాకు దక్కిన అరుదైన గౌరవం. ఇది మన ప్రజలు, సంప్రదాయాలు, దేశాన్ని ఏకం చేసే బంధాలను చాటిచెబుతోంది. ఈ యాత్రలో పాలుపంచుకున్న ప్రతి కార్యకర్తకు మీ మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి" అని వివరించారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రభుత్వ అధినేత బాధ్యతల్లో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని టీడీపీ ఈ 'సేవా సంకల్ప యాత్ర'ను నిర్వహించింది. ఇందులో భాగంగా టీడీపీ శ్రేణులు తిరుపతి నుంచి కాశీ వరకు సుమారు 2,000 కిలోమీటర్ల మేర బైక్ యాత్రను చేపట్టాయి. ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను సేకరించి, కాశీ విశ్వనాథునికి జలాభిషేకం నిర్వహించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం.అంతకుముందు ఈ యాత్రపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ఏపీ నుంచి నదీ జలాలను సేకరించి తీసుకురావడం తనను ఎంతో కదిలించిందని పేర్కొన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసిన టీడీపీ నేతలను, కార్యకర్తలను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

డ్రైవర్ హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ నిరాకరణ

విచారణ చివరి దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

ముందుగా హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచన

అమరావతి,అక్టోబర్7((సామాన్యుడి అస్త్రం)



వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ తుది దశకు చేరుకున్న సమయంలో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, ముందుగా హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది.కేసు విచారణ అత్యంత వేగంగా సాగుతోందని, మొత్తం 87 మంది సాక్షుల్లో అత్యధికుల విచారణ ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయడం సముచితం కాదని ఆయన తన వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విచారణ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనంతబాబు భార్య చేసిన అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది.ఈ సందర్భంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుని హైకోర్టును ఆశ్రయించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. విచారణను రోజువారీ పద్ధతిలో కొనసాగించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో, వీడియో ఫైల్స్, డిజిటల్ ఆధారాలకు సంబంధించిన మరో అనుబంధ పిటిషన్‌ను కూడా పిటిషనర్ తరఫు వారు ఉపసంహరించుకున్నారు.గతంలో బెయిల్‌పై విడుదలైన అనంతబాబుకు... సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో బెయిల్ రద్దు కావడంతో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.

ఢిల్లీలో సీఎం చంద్రబాబు..

నిర్మలా సీతారామన్‌తో భేటీ, రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ





ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ

రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం

విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాల నిధులపై విజ్ఞప్తి చేసే అవకాశం

రేపు సీఐఐ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి

అమరావతి,అక్టోబర్7(సామాన్యుడి అస్త్రం)

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు.రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయిఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.రేపు (అక్టోబర్ 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని రేపు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.

బరువు తగ్గడం నుంచి గుండె ఆరోగ్యం వరకు...

ఫైబర్‌తో ఎన్నో లాభాలు!

జీర్ణక్రియను మెరుగుపరిచే ఫైబర్
గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర
బరువు నియంత్రణ, షుగర్ లెవెల్స్ కంట్రోల్‌కు సహాయం
పప్పులు, పండ్లు, కూరగాయలలో పుష్కలంగా లభ్యం
ఫైబర్ తీసుకునేటప్పుడు తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి

ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. సరైన ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆరోగ్య నిపుణులు పదేపదే చెబుతున్నారు. మనం తీసుకునే ఆహారంలో కీలక పాత్ర పోషించే వాటిలో ఫైబర్ (పీచుపదార్థం) ఒకటి. ఇది మన శరీరం పూర్తిగా జీర్ణం చేసుకోలేని ఒక రకమైన కార్బోహైడ్రేట్ అయినప్పటికీ, దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గించడంలో ఫైబర్ ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది.



ఫైబర్ వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు

ఫైబర్ ప్రధానంగా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది మలానికి బరువును జోడించి, పేగుల కదలికలను సులభతరం చేస్తుంది. తద్వారా ఎంతోమందిని వేధించే మలబద్ధకం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. అంతేకాకుండా, ఓట్స్, పప్పుధాన్యాలలో ఉండే కరిగే ఫైబర్ (సాల్యూబుల్ ఫైబర్) రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది పేగులలో కొలెస్ట్రాల్ శోషణను అడ్డుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.మధుమేహంతో బాధపడేవారికి ఫైబర్ ఒక వరం లాంటిది. ఇది ఆహారంలోని కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను, గ్లూకోజ్ శోషణను నెమ్మదింపజేస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రణలో ఉంటాయి. ఇక బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఫైబర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అనవసరంగా తినాలనే కోరిక తగ్గి, బరువు నియంత్రణ సులభమవుతుంది. అలాగే, పేగులలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేసి, వాటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఏ పదార్థాలలో ఫైబర్ అధికం?

పప్పులు, శనగలు, రాజ్మా వంటి పప్పుధాన్యాలు, జామ, యాపిల్, నారింజ వంటి పండ్లు, క్యారెట్, బ్రకోలీ, చిలగడదుంప వంటి కూరగాయలలో ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. వీటితో పాటు ఓట్స్, చియా గింజలు, అవిసె గింజలు, బాదం వంటి వాటిని కూడా రోజూ ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఒక్కసారిగా అధిక మోతాదులో ఫైబర్ తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, ఆహారంలో ఫైబర్ మోతాదును క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలి. ఫైబర్ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా రోజూ తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. ఆరోగ్య నిపుణుల ప్రకారం, పెద్దలు రోజుకు సుమారు 25 నుంచి 38 గ్రాముల ఫైబర్ తీసుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.

ఆరోగ్యానికి సహజ రక్షణ ఇచ్చే ఫలం ఇదే... ఎలా తినాలో తెలుసుకోండి!



పోషకాల గనిగా పేరుపొందిన అంజీర్ పండ్లు
గుండె, ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు
రాత్రంతా నీటిలో నానబెట్టి తినడం శ్రేయస్కరం
మధుమేహం ఉన్నవారు మితంగా తీసుకోవాలని సూచన
రోజుకు 2 నుంచి 4 పండ్లు తినడం ఉత్తమం

మన ఆహారపు అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాంటి వాటిలో అంజీర్ (ఫిగ్స్) పండ్లను చేర్చుకోవడం ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పోషకాల గనిగా పేరుపొందిన అంజీర్, శరీరానికి సహజమైన రక్షణ కవచంలా పనిచేస్తుంది.అంజీర్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, మెగ్నీషియం వంటి పోషకాలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చడంతో పాటు, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. మెదడు పనితీరును మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచడంలో కూడా అంజీర్ కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మాన్ని కాంతివంతంగా మార్చడం వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

ఎలా తీసుకోవాలి?

రెండు లేదా మూడు ఎండు అంజీర్ పండ్లను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయాన్నే తినడం ఉత్తమమైన పద్ధతి. దీనివల్ల శరీరం పోషకాలను సులభంగా గ్రహిస్తుంది. అలాగే ఓట్స్, పెరుగు, స్మూతీలు లేదా సలాడ్లలో కలిపి కూడా తీసుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి

అయితే, అంజీర్‌ను మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా రోజుకు 2 నుంచి 4 పండ్లు సరిపోతాయి. ఎక్కువగా తింటే గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహాతో రోజుకు ఒకటి లేదా రెండు పండ్లకు మించి తీసుకోకపోవడం మంచిది.

కీరదోస తింటే అనారోగ్యమా? ఈ విషయాలు తెలుసుకోండి..!

కీరదోసతో ఆరోగ్యానికి మేలు
కొందరికి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం
చేదు కీరదోస తినొద్దు
కొందరికి ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం
అరుదుగా అలర్జీ రావచ్చు

ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చాలా మంది కీరదోసకాయను తమ డైట్‌లో చేర్చుకుంటున్నారు. క్యారట్, బీట్‌రూట్‌తో పాటు దీన్నీ పచ్చిగా తినేందుకు ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు కచ్చితంగా తింటున్నారు. ఇందులో ఫైబర్, నీటి శాతం ఎక్కువగా ఉండటంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. తరచూ ఏదో ఒకటి తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో క్యాలరీల వినియోగం తగ్గి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. అయితే కీరదోసకాయ అందరికీ ఒకేలా సరిపోదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందంటున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.



జీర్ణకోశ సమస్యలు

కీరలో ఉండే పీచు పదార్థాలు, సహజ రసాయనాలు కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి, అజీర్ణం వంటి సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా జీర్ణకోశం సున్నితంగా ఉండేవారు ఎక్కువ పరిమాణంలో తింటే ఈ ఇబ్బందులు కనిపించే అవకాశం ఉంటుంది.

చేదుగా ఉంటే జాగ్రత్త

కొన్నిసార్లు దోసకాయ సాధారణం కంటే మరీ చేదుగా ఉంటుంది. దీనికి 'కుకుర్బిటాసిన్స్' అనే సహజ రసాయనాలే కారణం. స్వల్ప మోతాదులో ఇవి ప్రమాదకరం కాకపోయినా, ఎక్కువగా ఉన్న కీర తింటే వికారం, వాంతులు, కడుపు నొప్పి, విరేచనాలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే చేదుగా అనిపించిన దోసను వెంటనే పారేయడం మంచిది.

ఫుడ్ పాయిజనింగ్

ఇతర పచ్చి కూరగాయల్లాగే కీరపై కూడా హానికర బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. సరిగా కడగకుండా లేదా పరిశుభ్రంగా నిల్వ చేయకుండా తింటే ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అలాంటి సమయంలో విరేచనాలు, జ్వరం, వాంతులు, కడుపు మంట, వికారం వంటి లక్షణాలు కనిపించవచ్చు.

అలర్జీ కూడా రావచ్చు

కీరతో అలర్జీ వచ్చే వారు చాలా తక్కువే. అయినా కొందరిలో నోరు, గొంతులో దురద, పెదవులు లేదా నాలుక వాపు, చర్మంపై దద్దుర్లు, గొంతు మంట వంటి లక్షణాలు కనిపించవచ్చు. తీవ్రమైన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

తరచూ మూత్ర విసర్జన

దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే అధికంగా తింటే సాధారణం కంటే ఎక్కువసార్లు మూత్ర విసర్జన కావచ్చు. ఆరోగ్యంగా ఉన్నవారికి ఇది పెద్ద సమస్య కాదు. కానీ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనలు పాటించడం మంచిది.

ఇలా తింటే సేఫ్

కీరదోసకాయ తినే ముందు బాగా కడగాలి. శుభ్రమైన, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి. చేదు రుచి ఉన్న కీర తినకూడదు. మితంగా తీసుకోవాలి. జీర్ణకోశ సమస్యలు ఉన్నవారు తొక్క తీసి తింటే మంచిది.

వయసుపై కొత్త నిజాలు.. ఈ వయసుల్లోనే వృద్ధాప్యం వేగవంతం!



వృద్ధాప్యం ఒకేలా సాగదు, కొన్ని వయసుల్లో వేగవంతం అవుతుంది
ముఖ్యంగా 44, 50, 60 ఏళ్లలో శరీరంలో మార్పులు చాలా వేగంగా జరుగుతాయి
స్టాన్‌ఫర్డ్, చైనా శాస్త్రవేత్తల పరిశోధనల్లో ఈ విషయాలు వెల్లడి
నడివయసులో జీవక్రియ, గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్న నిపుణులు
ఈ దశల్లో సరైన జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచన

వయసు పెరిగే ప్రక్రియ (వృద్ధాప్యం) నిరంతరం ఒకే వేగంతో సాగదని, కొన్ని నిర్దిష్ట వయసుల్లో జీవ సంబంధిత మార్పులు వేగవంతం అవుతాయని తాజా శాస్త్రీయ పరిశోధనలు తేల్చాయి. ముఖ్యంగా 44, 50, 60 ఏళ్ల వయసులో శరీరంలో కీలక మార్పులు వేగంగా చోటుచేసుకుంటాయని స్టాన్‌ఫర్డ్ మెడిసిన్, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మార్పులు జీవక్రియ, గుండె ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతాయి.స్టాన్‌ఫర్డ్ మెడిసిన్ నిర్వహించిన ఒక అధ్యయనంలో, 25 నుంచి 75 ఏళ్ల వయసు వారిలో దాదాపు 1,35,000 అణువులు, సూక్ష్మజీవులను విశ్లేషించారు. 40వ పడి మధ్యలో, 60 ఏళ్ల సమీపంలో శరీరంలో రెండు ప్రధాన మార్పుల దశలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సమయంలో జీవక్రియ, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, రోగనిరోధక వ్యవస్థ పనితీరులో మార్పులు గమనించారు. మరోవైపు, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జరిపిన పరిశోధనలో 50 ఏళ్ల వయసును ఒక కీలక మలుపుగా గుర్తించారు. ఈ వయసు తర్వాత అనేక అవయవాలు, ముఖ్యంగా రక్తనాళాల పనితీరు వేగంగా క్షీణించడం మొదలవుతుందని వెల్లడైంది.స్టాన్‌ఫర్డ్ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ మైఖేల్ స్నైడర్ మాట్లాడుతూ, "శరీరంలో మార్పులు క్రమంగా కాకుండా, కొన్నిసార్లు నాటకీయంగా ఉంటాయి" అని వివరించారు. 40 ఏళ్లలో బరువు పెరగడం, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టడం వంటివి ఈ మార్పుల వల్లే జరుగుతాయని నిపుణులు అంటున్నారు.ఈ పరిశోధనల ప్రకారం, వ్యాధులు వస్తాయని భయపడాల్సిన అవసరం లేదని, అయితే నడివయసు నుంచే సరైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. కండరాలను కాపాడుకోవడానికి వ్యాయామం, క్రమం తప్పకుండా రక్తపోటు, కొలెస్ట్రాల్, షుగర్ స్థాయిలను పర్యవేక్షించుకోవడం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, మద్యపానాన్ని పరిమితం చేయడం వంటి చర్యల ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపవచ్చని వారు సలహా ఇస్తున్నారు.

ఆవు నెయ్యితో ఆశ్చర్యకరమైన ప్రయోజనాలు!

ఆవు నెయ్యి ఆరోగ్య ప్రయోజనాలపై పెరుగుతున్న ఆసక్తి
జీర్ణక్రియ మెరుగుపరచడం, బరువు నియంత్రణలో సహాయం
విటమిన్ ఏ, బ్యూట్రిక్ యాసిడ్ వంటి పోషకాలతో సంపూర్ణం
అధికంగా కాకుండా మితంగా వాడాలంటున్న నిపుణులు
గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని అధ్యయనాల వెల్లడి

రియల్ అడ్వైజర్ న్యూస్

భారతీయ గృహాల్లో, ముఖ్యంగా వంటింట్లో ఆవు నెయ్యికి విశిష్ట స్థానం ఉంది. కేవలం వంటకాలకే పరిమితం కాకుండా, తరతరాలుగా దీనిని సంప్రదాయ వైద్యంలోనూ విరివిగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆవు నెయ్యిలోని ఆరోగ్య ప్రయోజనాలపై సర్వత్రా ఆసక్తి పెరుగుతోంది. ఆయుర్వేద నిపుణులతో పాటు ఆధునిక



శాస్త్రవేత్తలు సైతం నెయ్యి వినియోగం వల్ల కలిగే మేలును విశ్లేషిస్తున్నారు. ఈ మేరకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఓ కథనం వెలువరించింది.మితంగా ఆవు నెయ్యిని తీసుకోవడం వల్ల బరువును నియంత్రించవచ్చని, శరీరంలో వాపులు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, హృదయ ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది. ఇందులో పుష్కలంగా ఉండే కాంజుగేటెడ్ లినోలెయిక్ యాసిడ్, బ్యూట్రిక్ యాసిడ్, విటమిన్-ఏ వంటి పోషకాలే ఈ విశిష్ట గుణాలకు కారణమని విశ్లేషిస్తున్నారు.పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, నెయ్యి జీర్ణ వ్యవస్థను ఉత్తేజపరిచి, ఆహారంలోని పోషకాలను శరీరం సులభంగా గ్రహించేలా చేస్తుంది. అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలతో సతమతమయ్యే వారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. అయితే, కేవలం రుచి కోసం తగిన మోతాదులో మాత్రమే వాడాలని, అతిగా వాడటం శ్రేయస్కరం కాదని వారు స్పష్టం చేస్తున్నారు.నెయ్యిలో ఉండే 'బ్యూట్రేట్' అనే ఫ్యాటీ యాసిడ్ పేగుల ఆరోగ్యానికి తోడ్పడటంతో పాటు ఇన్ఫెక్షన్లను నివారిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. అయితే ఈ ప్రయోజనాలన్నీ మితమైన వినియోగంతోనే సాధ్యమని గుర్తించాలి. నెయ్యిలో కొవ్వు శాతం అధికంగా ఉండటం వల్ల అతిగా తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

నా బ్లౌజ్ గురించి చర్చ పెట్టడమేంటో..!


బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్తన దుస్తులపై జరిగిన చర్చపై ఎట్టకేలకు నోరు విప్పింది. ఒక జ్యువెలరీ బ్రాండ్కోసం ఆమె నటించిన రక్షాబంధన్ ప్రకటనలో సాంప్రదాయ పండుగ వాతావరణానికి(తగని విధంగా మోడ్రన్ దుస్తులు(ధరించారంటూ గతంలో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. రక్షాబంధన్ ప్రకటనలోని కృతి ఇండో-వెస్ట్రన్ దుస్తులు(ధరించడంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో సదరు బ్రాండ్ ఆ యాడ్ను ఉపసంహరించుకుంది. తాజాగా 'వాట్ విమెన్ వాంట్' టాక్ షోలో అతిథిగా పాల్గొన్న కృతి సనన్.. ఆ దుస్తుల వివాదంపై స్పందించింది.ఒక పండుగ ప్రకటనలో నా చోళీ (బ్లౌజ్) అంత పెద్ద వివాదం సృష్టిస్తుందని నేను ఊహించలేదు. ప్రైమ్-టైమ్ వార్తల్లో నా బ్లౌజ్ గురించి ఆరుగురు సభ్యుల ప్యానెల్ కూర్చొని చర్చించడం చూసి షాక్ అయ్యా. నా కళ్లను నేనే నమ్మలేకపోయా" అని తెలిపింది. ఇక మహిళల స్వేచ్ఛపై కృతి మాట్లాడుతూ.. 'మహిళలను పదే పదే జడ్జ్ చేయడం ఆపాలి. సమాజం ఇతరుల విషయాల్లో అనవసరంగా తలదూర్చకుండా ఎవరి పని వారు చూసుకుంటే చాలు.మహిళలు కోరుకునేది అదే. మహిళలు గౌరవాన్ని, సంస్కృతిని గుండెల్లో మోస్తారు. వారు వేసుకునే బట్టల ఆధారంగా వారి సంస్కారాన్ని అంచనా వేయలేరు.



మయూఖ పూర్తి థ్రిల్లర్గా ఆకట్టుకునే చిత్రం

పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'మయూఖ('. ఈ చిత్రానికి శ్రీతేజ్ ఎస్కే(దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశ్విత ఎంటర్టైన్మెంట్ బ్యానర్పై శశిధర్ నల్ల(నిర్మిస్తున్నారు. సినిమా బండి ప్రొడక్షన్స్ బ్యానర్పై పలు ఆసక్తికర సినిమాలు నిర్మించిన శ్రీకాంత్ కాండ్రేగుల.. ఇప్పుడు శ్రీతేజ్ ఎస్కేగా స్క్రీన్ నేమ్ మార్చుకుని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 9న థియేట్రికల్ రిలీజ్కు రాబోతున్న ఈ సినిమా విశేషాలను విలేకరులతో పంచుకున్నారు డైరెక్టర్ శ్రీతేజ్ ఎస్కే. "మా మయూఖ సినిమాకు ఇటీవల న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్లో బెస్ట్ మిస్టరీ మూవీగా అవార్డ్ వచ్చింది.


విమానాల కాక్పిట్ భద్రతపై సోనూ సూద్ కీలక సూచన



ప్రముఖ నటుడు సోనూ సూద్ విమానయాన భద్రతకు సంబంధించి ఓ కీలక సూచన చేశారు. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన దాడి ఘటన నేపథ్యంలో, కాక్పిట్ భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అత్యవసర పరిస్థితుల్లో బయటి నుంచి కాక్పిట్ డోర్ తెరిచేందుకు వీలుగా ఒక ప్రత్యేక విధానాన్ని పరిశీలించాలని విమానయాన సంస్థలకు సూచించారు.ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ చేశారు. "అత్యవసర పరిస్థితిలో కాక్పిట్లోని పైలట్లు తలుపు తెరవలేని స్థితిలో ఉంటే, బయట ఉన్న సిబ్బంది సహాయం చేయడానికి వీలుగా ఒక ప్రత్యేక ఎమర్జెన్సీ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. అత్యంత కట్టుదిట్టమైన నిబంధనల మధ్య, నియమిత సిబ్బందికి మాత్రమే ఈ కోడ్ను అప్పగించాలి. ఈ అదనపు భద్రతా పొర ప్రాణాలను కాపాడగలదు. దీనిపై చర్చ జరగాలి" అని సోనూ సూద్ పేర్కొన్నారుసెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్పై కో-పైలట్ కాక్పిట్లోనే గొడ్డలితో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.

ఇంట్లోవాళ్లు తిడుతుంటారు!

కేజీఎఫ్' చిత్రంతోదేశవ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకున్న కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి(ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ విక్టరీ వెంకటేశ్, కల్యాణ్ రామ్() ప్రధాన పాత్రల్లో త్రివిక్రమ్ శ్రీనివాస్() తెరకెక్కిస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తోంది. ఈ మూవీ ప్రమోషన్లలో(భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటోంది శ్రీనిధి శెట్టి(. ఈ సందర్భంగా తన కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు తెలిపింది. తన ఖాతాలో 'కేజీఎఫ్' లాంటి ఇండస్ట్రీ హిట్ పడినా, తనకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంపై తొలిసారి స్పందించింది.కేజీఎఫ్' అంత పెద్ద సక్సెస్ సాధించినా, ఇప్పటికీ కెరీర్ విషయంలో కంగారు పడకుండా ఖాళీగా కూర్చుంటుంటే ఇంట్లో వాళ్లు తిడుతుంటారు



మలయాళ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ .. ఓటీటీలో!

మలయాళం నుంచి మరో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ప్రధానమైన పాత్రలో పార్వతీ తిరువోతు క్రితం నెలలో విడుదలైన సినిమా ఈ నెల 9వ తేదీ నుంచి స్ట్రీమింగ్



మలయాళంలో సూపర్ హిట్ అనిపించుకున్న ఒక సినిమా ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతోంది. ఆ సినిమా పేరే 'ప్రథమ ద్రుష్ట్యా కుట్టక్కర్'. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన సినిమా ఇది. పార్వతీ తిరువోతు ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, షహద్ నిలంబూర్ దర్శకత్వం వహించాడు. సెప్టెంబర్ 11వ తేదీన ఈ సినిమా అక్కడి థియేటర్లలో భారీస్థాయిలో విడుదలైంది. గట్టిపోటీని తట్టుకుని నిలబడి హిట్ టాక్ తెచ్చుకుంది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను 'నెట్ ఫ్లిక్స్' వారు దక్కించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్టుగా అధికారికంగా ప్రకటించారు. పార్వతీ తిరువోతుతో పాటు మాథ్యూ థామస్ .. విజయ రాఘవన్ .. సిద్ధార్థ్ భరత్ కనిపించనున్నారు. ముజీబ్ మజీద్ అందించిన నేపథ్య సంగీతం కనెక్ట్ అవుతుందని అంటున్నారు. ఈ సినిమాలో 'అలీనా అబ్రహం' అనే కానిస్టేబుల్ పాత్రలో పార్వతీ తిరువోతు కనిపించనుంది.

ఓటీటీ సెంటర్ కి మలయాళ సైకలాజికల్ థ్రిల్లర్!



మలయాళం ఇండస్ట్రీ నుంచి సైకలాజికల్ సినిమాలు ఎక్కువగా వస్తుంటాయి. మలయాళంలో ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలకి, ఓటీటీ వైపు నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. విభిన్నమైన కథలు .. విలక్షణమైన పాత్రలు .. ఆ పాత్రల స్వభావాలను మలచిన తీరు అందుకు కారణమనుకోవాలి. ఈ నేపథ్యంలో మరో సైకలాజికల్ సినిమా ఓటీటీ ఆడియన్స్ ముందుకు రావడానికి ముస్తాబవుతోంది. మలయాళంలో రూపొందిన ఆ సినిమా పేరే 'ఆశ'.నసర్ సనాల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను వినాయక అజిత్ నిర్మించాడు. సీనియర్ నటి ఊర్వశి .. జోజు జార్జ్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమా ఇది. ఈ సినిమాకి కథను అందించినది జోజు జార్జ్ కావడం విశేషంగా చెప్పుకోవాలి. సెప్టెంబర్ 11వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, అక్టోబర్ 16వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు .. తమిళ .. కన్నడ భాషల్లోను అందుబాటులోకి రానుంది. కథలోకి వెళితే .. 'ఆశ' నడివయసు దాటిన ఒక మహిళ. తన జీవితంలో ఎదురైన సంఘటనల కారణంగా ఆమెలో మొడితనం పెరుగుతూ పోతుంది. అలాంటి ఆమె తన కూతురు కూతురుతో కలిసి నివసిస్తూ ఉంటుంది. ఐటీలో జాబ్ చేస్తున్న తన కూతురుతో కలిసి ఆమె ఒక రాత్రివేళ కారులో ప్రయాణం చేస్తూ ఉంటుంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.